



# లోతందని చంద్రుడు

-సి.వి. సర్వేశ్వర శర్మ
-చివలి శ్రీ వాగ్దేవి

ఏ జన్మలో ఏ పాపం చేసిందో ఈ జన్మలో తన బతుకు ఇలా అయిపోయిం దనుకుని వెంకమ్మ విచారించని రోజు లేదు. అన్నీ ఉన్నా వెంకమ్మకు అయిదోతనం తప్పుకుంది. తెలిసీ తెలియని వయసులో జరిగిపోయింది ఘోరం. సాంప్రదాయం కోరికలను నొక్కేసింది. జీవచ్ఛవంలా బ్రతికేస్తోంది.

ఒంటినిండా నగలు పెట్టుకోవాలని ఆమె ఆరాటం. నలుగురి ముందూ ఎలా ఉన్నా ఒంటరిగా ఉన్నప్పుడు అద్దం ముందు కూర్చుని నగలన్నీ పెట్టుకుని తన అందానికి తనే మురిసిపోయేది. అయితే అదంతా క్షణికం.

గోదావరికి పుష్కరాలు. తప్పకుండా వెళ్ళా లనుకుంది. ఇంట్లో మరిదిగాని, తోటికోడలుగాని కూడా వచ్చేందుకు వీలు కాని స్థితిలో ఉన్నారు. ఒక్కతెనూ పుష్కరాలకు వెళ్ళవద్దని బ్రతిమిలాడారు.

ఓపిక ఉండగా పుణ్యక్షేత్రా లన్నీ తిరిగి, పుణ్య నదుల్లో మునిగి పాపాల్ని కడిగేసుకుంటే, వచ్చే జన్మలోనైనా సుఖశాంతు లుంటాయని వెంకమ్మ గట్టిగా తన నమ్మకాన్ని చెప్పింది.

ఎవరూ చూడకుండా నగలతో బయలుదేరింది. రైలు ఎక్కగానే నగలు పెట్టేసుకుంది. తానే లక్ష్మీదేవి అనుకుని వెంకమ్మ ఎంతో గర్వపడింది. కాని తన పరిస్థితి గుర్తుకు వచ్చి గతుక్కు మంది.

అనుకున్నది సాధించింది. జనం రద్దీ ఎక్కువగా ఉన్నా మొత్తం మీద రాజమండ్రి పుష్కరాల రేవుకు జేరింది. గోదావరిలో స్నానం చేయాలి. జాగ్రత్తగా ఒంటిమీద నగలన్నీ తీసి సంచిలో పెట్టింది. నలభయి ఏళ్ళ వెంకమ్మకు మంచి శరీరబలమే కాదు, గుండెబలం కూడా ఉంది.

సంచీ ఒడ్డున పెట్టి గోదావరిలో స్నానం చేయడానికి దిగింది. పోలీసు ఈల వినిపించింది.

ఎవరో పరుగెత్తుతున్నారు. ఇద్దరు పోలీసులు పరుగెత్తి పారిపోతున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఆ దొంగ చేతిలో వెంకమ్మ సంచీ ఉంది.

హడావుడి చూసిన వెంకమ్మ క్షణంలో తెలుసుకుంది జరిగిన ప్రమాదం. తను తెచ్చుకున్న చిన్న సూటుకేసు అక్కడే ఉంది. నగలు పెట్టిన సంచీ దొంగ కాజేశాడు. "ఆ సంచీ

నాది.'' వెంకమ్మ అంది.

"వీడి మీద కేసు పెట్టాలి. కంట్రోలు రూముకు రండి.'' పోలీసు హెడ్ కానిస్టేబుల్ వెంకమ్మకు చెప్పాడు.

సూటుకేసులో చీర తీసుకుంది. పొడి చీర కట్టుకుంది. పోలీసు కంట్రోలు రూమ్‌కు వెళ్ళింది. వెంకమ్మ తను లేచిన వేళ మంచి దనుకుంది. లేకపోతే పోలీసులు దొంగను వెంటనే పట్టుకోవడ మేమిటి? ఎన్నో దొంగతనాల గురించి తను వింది. పోలీసులు దొంగలను పట్టుకున్న వైనం చాలా అరుదుగా చెప్పుకున్నారు.

పోలీసు కంట్రోల్ రూమ్‌లో అడుగు పెట్టిన వెంకమ్మ అక్కడ దృశ్యం చూసి ఆశ్చర్యపోయింది. పోలీసు ఆఫీసర్లు ఉన్నారు. గదిలో టెలివిజన్లు ఉన్నాయి. ప్రతి రేవులోనూ ఏమి జరుగుతున్నది టీ.వీ. తెరమీద కనిపిస్తోంది. అప్పుడు అర్థమైంది వెంకమ్మకు పోలీసు బందోబస్తు ఎంత పకడ్బందీగా ఉందో.

తన సంచీ కాజేసిన దొంగను ఈ టెలివిజన్‌లో చూసి అక్కడున్న పోలీసులకు వైర్‌లెస్‌లో చెప్పారన్నమాట. ఎంత సులువుగా దొంగను పట్టారు! వెంకమ్మ ఎంతో ఆశ్చర్యపోయింది.

ఆఫీసరు వెంకమ్మను మందలించాడు. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. రిపోర్టు ఇచ్చింది. ఆఫీసరు చాలా సమయస్ఫూర్తిగా వ్యవహించాడు. ఆ దొంగను రిమాండులో ఉంచమని వెంకమ్మ నగలు ఇచ్చి ఆమెను పంపివేశాడు.

వెంకమ్మ పరిస్థితిని సులువుగా ఊహించిన ఆఫీసరు జగన్నాథం ఆమె మీద జాలిపడ్డాడు. అందుకే ఒక కానిస్టేబుల్‌ను సాయం ఇచ్చి ఆమెను రైలు ఎక్కి ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పాడు.

పోలీసు లంటే ప్రజానీకానికి భయం. స్నేహంగా మాట్లాడటానికి కూడా జంకుతారు. వాళ్ళది రాతి గుండె. పాపభీతి ఉండదు. ఎంతటి దారుణం చేయడానికైనా వెనుకాడరు. ఈ రకమైన అభిప్రాయాలు చాలామందికి ఉండటం దురదృష్టం అంటాడు జగన్నాథం.

జగన్నాథం ఎంత దయాగుణ సంపన్నుడో అంతటి చండశాసనుడు. అతని పేరు చెబితే కింద పనిచేసే పోలీసు లందరకూ హడలే. పై పోలీసు ఆఫీసర్లు జగన్నాథాన్ని కొంత గౌరవభావంతో చూస్తారు.

జగన్నాథం తన సిన్సియారిటీ వల్ల త్వరత్వరగా ప్రమోషన్లు తెచ్చుకుని చిన్న వయసులోనే డి.ఎస్.పి. అయిపోయాడు. మిలటరీలో పని చేయడం కారణంగా క్రమశిక్షణ అతని జీవితంలో ఒక భాగం అయిపోయింది.

జూదం, దొంగతనం, వ్యభిచారం, బలాత్కారం - ఒకటేమిటి సమస్త నేరాలనూ అరికట్టేందుకు కృషి చేయాలి. సామాజిక భద్రతకు పోలీసు వ్యవస్థ నిలబడాలి - ఇది జగన్నాథం వృత్తిధర్మంగా పెట్టుకున్నాడు.

తమ పిల్లలు తప్పిపోయారని కంట్రోలు రూమ్ దగ్గరకు వచ్చి తల్లిదండ్రులు రిపోర్టు ఇస్తున్నారు. దొరికిన పిల్లల్ని చూపిస్తున్నారు. కొందరు తమ తలిదండ్రులను గుర్తిస్తున్నారు.

పోలీసులకు పని ఎలా ఉంటుందో చూసిన వారికి తెలుస్తుంది. ఏ క్షణంలో ఏ రిపోర్టు వస్తుందో తెలీదు. తప్పిపోయిన పిల్లల్ని జాగ్రత్తగా చూడాలని జగన్నాథం ప్రతి పోలీసు ఉద్యోగికీ హెచ్చరించి చెప్పాడు.

పాపం పసిపిల్లలు! వాళ్ళకి ఏ లోటూ రాకూడదు. వాళ్ళ ముఖాలు చూస్తుంటే బిక్కచచ్చి ఉన్నాయి. బెంగ ఒక వైపు, ఆకలి మరొకవైపు. అందుకే తాము చేయగలిగిన పని వారి ఆకలి తీర్చడం. ఆ విషయంలో శ్రద్ధ వహించమని జగన్నాథం తన క్రింద ఉద్యోగులకు చెపుతూ ఉంటాడు.

పిల్లల పేర్లు చెబుతూ, ఆ పిల్లల తలిదండ్రులనూ కంట్రోల్ రూమ్ దగ్గరకు రమ్మని మైక్‌లో పోలీసు కానిస్టేబుల్ చెబుతున్నాడు. అన్ని రేవుల దగ్గర లౌడ్ స్పీకర్ల నుంచి మాటలు ప్రసారం అవుతున్నాయి.

నలుగురు పిల్లల్ని వెంట బెట్టుకుని కానిస్టేబుల్ రమణయ్య కంట్రోల్ రూమ్‌కు వచ్చాడు.

"సార్! ఈ పిల్లలు తలిదండ్రుల నుంచి తప్పిపోయారు. వీళ్ళు తలిదండ్రుల కోసం ఏడుస్తున్నారు - తీసుకువచ్చాను.'' రమణయ్య చెప్పాడు.

జగన్నాథం ఏదో కేసుకు సంబంధించిన కాగితాలు చూస్తున్నాడు. తలెత్తి చూశాడు. నలుగురు పిల్లలు. అందులో ఒక పిల్లవానిమీద జగన్నాథం దృష్టి పడింది. ఆరే ళ్ళుంటాయి. కొత్తలాగు, చొక్కా ధరించాడు. తల దువ్వుకుని చాలా శుభ్రంగా ఉన్నాడు.



"నీ పేరు?" జగన్నాథం ఆ పిల్లాడిని ఉద్దేశించి అడిగాడు.

"చంద్రం." నిదానంగా జవాబు ఇచ్చాడు.

"నీ పూర్తి పేరు తెలీదా? నగం నగం పేరు చెబుతావు?" ప్రశ్నించాడు.

"నా పేరు వంకాయల చంద్రుడు. నన్ను చంద్రం అని పిలుస్తారు." జవాబు చెప్పాడు.

జగన్నాథం చంద్రం కేసి పరిశీలనగా ఒకసారి చూశాడు. చంద్రం చాలా ధైర్యంగా నుంచున్నాడు. మిగిలిన ముగ్గురు ఏకధారగా ఏడుస్తున్నారు. జగన్నాథానికి వాళ్ళని చూస్తే జాలి వేసింది. పరిచయం బాగా ఎక్కువ ఉన్న కానిస్టేబుల్ రమణయ్య. అందుకే రమణయ్యకు పురమాయించాడు.

"ఈ నలుగురు పిల్లల్నీ పక్క గదిలో ఉన్న సోఫా మీద కూర్చోబెట్టి వాళ్ళ పేర్లు తెలుసుకుని మైక్‌లో చెప్పు."

రమణయ్య నలుగురు పిల్లల్నీ పక్క గదిలోకి తీసుకువెళ్ళాడు. లాలించి అడగడం ప్రారంభించాడు. రమణయ్య అడుగుతున్న కొద్దీ వాళ్ళు గుక్కపెట్టి ఏడ్చేస్తున్నారు. చంద్రం మాత్రం ప్రశాంతంగా ఉన్నాడు.

"సార్! నేను అడుగుతా నుండండి." చంద్రం అన్న మాటలకు ఉలిక్కి పడ్డాడు రమణయ్య.

"తమ్ముడూ! ఆకలి వేస్తోందా? బిస్కట్లు తింటావా?" చంద్రం అడిగాడు.

ముగ్గురూ బిస్కట్లు తింటా మని త లూపారు.

"మీ నాన్న పేరు చెప్పు నేను వెళ్ళి అడిగి తీసుకు వస్తాను." చంద్రం బుజ్జగింపుగా అన్నాడు ఒక పిల్లవాడిని చూసి.

ఒకరి తరువాత మరొకరు తమ వివరాలు చెప్పారు. చంద్రం కూడా తన వివరాలు చెప్పాడు. రమణయ్య మైక్‌లో పిల్లల సంగతి చెప్పాడు. జగన్నాథం చంద్రాన్ని ఒక కంట కనిపెడుతూ ఉన్నాడు. లాంఛనంగా భోజన ఏర్పాట్లు చేశారు. నలుగురు పిల్లలూ భోజనాలు నామ మాత్రంగా చేశారు. చంద్రం సోఫా మీద పడుకున్నాడు. హాయిగా నిద్రపోయాడు.

మధ్యాహ్నం మూడు గంట లయింది. జగన్నాథం దగ్గరకు కొంతమంది తలిదండ్రులు వచ్చారు. తమ బిడ్డల్ని గుర్తు పట్టారు. వాళ్ళని తీసుకుని వెళ్ళిపోయారు.

**అందుకు కాదు**

"ఏమిటోయ్, సినిమాకి వచ్చావా?" ఇంటర్వెల్లో తనతోపాటు హాల్లోంచి బయటకొచ్చిన రాజాని పలకరించాడు రమేష్.

"అబ్బే! లేదండీ! ఇంటర్వెల్లో బఠానీలు అమ్ముకుందామని వచ్చాను!" చిర్రెత్తుకొచ్చిన రాజా రకీమని చెప్పాడు.

-ఐరేని శ్రీనివాస్‌గౌడ్
[రామాయంపేట]

చంద్రం కోసం ఎవరూ రాలేదు. చంద్రం ఎవరి కోసమూ ఎదురు చూస్తున్నట్లు లేదు. నిద్ర లేచాడు. పోలీసు లందరకూ శాల్యూట్ చేస్తున్నాడు. వాళ్ళకి ఏమైనా కావాలంటే క్షణాల మీద తీసుకు వస్తున్నాడు.

కాఫీ, టీ, సిగరెట్లు మాత్రమే కాదు. ఆఫీసులో ఫైల్సు ఒక సీటు దగ్గర నుంచి మరొక సీటుకు అందించేస్తున్నాడు. రాత్రి ఎనిమిది గంట లయ్యేసరికి పోలీసు కంట్రోల్ రూమ్‌లో ఉన్న పోలీసు లందరకూ ఎంతో సన్నిహితు డైపోయాడు చంద్రం.

చంద్రం కదలికలను గమనిస్తున్న జగన్నాథానికి చంద్రం అంటే అంత సదభిప్రాయం కలగడంలేదు. నిజంగా చంద్రం తప్పిపోయిన పిల్లవాడా అనే అనుమానం మొదలైంది. పోలీసు ఉద్యోగ ధర్మమా అని అనుమానాలు వాటంతట అవే పుట్టుకు వస్తాయి కదా!

దేనినయినా జగన్నాథం భరిస్తాడు గాని, నిబంధనలలో ఉన్న చిన్న విషయాన్ని ఆసరా చేసుకుని, దాన్ని స్వ ప్రయోజనాలకు వినియోగించుకుంటే తట్టుకోలేడు.

తప్పిపోయిన పిల్లలకు పోలీసులు రక్షణ కల్పిస్తారని తెలిసిన చంద్రం తన పొట్ట కూటికోసం తప్పిపోయిన పిల్లవాడిలా పోలీసుల పంచన చేరాడా? నిండా ఆరేళ్ళు లేవు. వీడు పోలీసులను వంచన చేస్తాడా? వాడిలో ఏకోశానా తలిదండ్రుల ధ్యాస ఉన్నట్లు లేదు. అసలు ఈ చంద్రం ఎవరు? ఏమిటి వీడు ఇంతగా తనకు ఆలోచనలు కలిగిస్తున్నాడు. ఇంత చిన్న వయసులో ఇలాంటి వృత్తి చేపడితే పెద్దవాడైతే సమాజానికి వీడు ఎంత పెద్ద బెడదగా తయా రవుతా డు? - జగన్నాథం ఆలోచిస్తున్నాడు.

చంద్రాన్ని పిలిచాడు. "మీ వాళ్ళు ఎవరైనా వచ్చారా?"

లే దని తలూపాడు. అతని ముఖంలోకి పరీక్షగా చూశాడు జగన్నాథం.

"రాత్రి ఎప్పుడు భోజనం చేస్తావు?"

"ఎప్పుడు పెడితే అప్పుడు." జవాబులో ఎంతో నిదానం.

అక్కడే జగన్నాథం అనుమానం మరింత బలపడిపోయింది.

"భోజనం పెట్టకపోతే ఏం చేస్తావు?"

"ఏమీ చెయ్యను." సమాధానం.

పెద్ద పోలీసు ఆఫీసరు ముందు ఆరేళ్ళ కుర్రాడు చెప్పే జవాబులేనా? అందునా తలిదండ్రుల నుంచి తప్పిపోయినవాడు.

"సరే! వెళ్ళు." జగన్నాథం చంద్రాన్ని వెళ్ళమన్నాడు.

చంద్రం పక్క గదిలోకి వెళ్ళి సోఫా మీద ఉన్న మరొక తప్పిపోయిన కుర్రాడితో మాట్లాడుతున్నాడు.


"కంగారుపడకు! మీ అమ్మా నాన్నా నీ కోసం వస్తారు. వాళ్ళు వెతుకుతూ ఉంటారు. నువ్వు ఇక్కడ ఉన్నట్లు వాళ్ళకి తెలియాలి కదా?"


ఆ కుర్రాడు నీరసంగా బెంగతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

జగన్నాథం విన్నాడు చంద్రం మాటలు. అందుకే చంద్రం గురించి పట్టించుకో నవసరం లే దనుకున్నాడు. చంద్రం భోజనం గురించి ప్రత్యేకించి ఏమీ చెప్పలేదు.

డ్యూటీ అయిపోయింది. జగన్నాథం ఇంటికి వెళ్ళిపోయాడు. జగన్నాథం మనసులో ఒకవైపు ఆలోచన వస్తోంది.

పని లేకపోయినా చంద్రం గురించి





తెలుసుకుందామని మర్నాడు ఉదయం పదిగంటలకు కంట్రోలు రూమ్‌కు వెళ్ళాడు జగన్నాథం. చంద్రం పోలీసుల మధ్య అతి సన్నిహితంగా తిరుగుతున్నాడు. నిస్సందేహంగా చంద్రం మొనగాడు. పోలీసుల పంచన జేరి రెండుపూటలా తిండి తింటున్నాడు - జగన్నాథం నిర్ణయానికి వచ్చేశాడు.

చంద్రం పూర్తి వ్యవహారం మధ్యాహ్నం డ్యూటీకి వచ్చిన తరువాత చూడా లనుకున్నాడు.

మధ్యాహ్నం డ్యూటీకి రాగానే చాలా ముఖ్యమైన విషయాలు చూడాల్సి వచ్చింది జగన్నాథానికి. ఆ విషయాల్లో తల దూర్చి పనిలో నిమగ్నమై ఉన్నప్పటికీ, చంద్రం సంగతి తేల్చాలని చాలా ఆత్రతగా ఉన్నాడు.

ఉన్నట్లుండి పెద్దగా ఏడుపులు వినిపించడం మొదలైంది. పోలీసు కంట్రోలు రూం ఆవరణలో ఈ ఏడుపు ఏడుస్తున్నట్లు జగన్నాథం గ్రహించాడు.

సీట్లోంచి లేచి కంట్రోల్ రూమ్ బయటకు వచ్చాడు. తన కళ్ళను తను నమ్మలేకపోయాడు.

ఇరవై ఏడే ళ్ళుంటాయి ఆమెకు. జుట్టంతా చింపిరిగా ఉంది. దువ్వుకున్న జాడ లేదు. బట్టలు దుమ్ము పట్టి ఉన్నాయి. మార్చినట్లు లేదు. కళ్ళలో ఎంతో అలసట కనిపిస్తోంది. ఎంతో కాలం క్రితం విశ్రాంతి తీసుకు న్నట్లున్నాయి. ఆమె శరీరంలో ఎంతో ఆకర్షణ కనిపిస్తోంది. ఆమెను వాటేసుకుని చంద్రం ఉన్నాడు.

పరిసరాలు మరిచి రోదిస్తున్నారు. ఎన్నో యుగాల తర్వాత మళ్ళీ కలిసిన వారిలా ఒకరి నొకరు కౌగలించుకుని ఏడుస్తున్నారు. చంద్రం ఒళ్ళంతా తడిమేస్తోంది ఆమె. ఆమెకి అతుక్కుపోయి వాత్సల్యాన్ని జుర్రుకుంటున్నాడు చంద్రం.

జగన్నాథం నిశ్చేష్టుడై చూస్తున్నాడు. పోలీసు హెడ్ కానిస్టేబుల్ జాకొబ్ హడావుడిగా వారి దగ్గరకు వెళ్ళబోయాడు. జగన్నాథం వారించాడు.

జగన్నాథం తన గదిలోకి వెళ్ళిపోయాడు. పది నిముషాలు గడిచాయి. చంద్రం, ఆమె జగన్నాథం దగ్గరకు వచ్చారు.

"మా అమ్మగారు వచ్చారు." చంద్రం చెప్పాడు.

"నమస్కారమండి."

జగన్నాథం తలెత్తి చూశాడు.

"వీడు నా కొడుకు. పుష్కరాలని గోదావరిలో స్నానం చేయడానికి వచ్చాం. నిన్న ఉదయం తప్పిపోయాడు. చాలా భయపడిపోయాను. మీరు చాలా అభిమానంగా చూశారట. మా చంద్రుడు చెప్పాడు. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియటంలేదు. దక్క డనుకున్న నా కొడుకు దక్కేటట్లు చేశారు."

ఆమె కంఠంలో ఎంతో కృతజ్ఞతా భావం, నిండుదనం గుర్తించాడు జగన్నాథం.

"పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలి!" మరొక సందర్భంలో అయితే హెచ్చరించేవాడు. కాని ఎందుచేతనో ఆ హెచ్చరిక చేయలేకపోయాడు. చంద్రం కేసి చూశాడు. ఈ సారి జగన్నాథానికి కొత్త చంద్రం కనిపిస్తున్నాడు. ఆరేళ్ళ చంద్రంలో ఎనభైఏళ్ళ చంద్రుడు ఉన్నాడు. తల్లిని పోగొట్టుకుని ఆ విచారం వీసమెత్తైనా బహిర్గతం చేయకుండా గంభీరంగా తిరుగుతూ అందరికి సంతోషాన్ని కలుగజేస్తూ ఒక ఎటాచ్‌మెంట్ ఏర్పరచుకున్నాడు. ఇలాంటి అనుభవం కథల్లోనేగాని నిజ జీవితంలో ఎదు రవుతుందా?

తన అనుభవం అతని ప్రవర్తనను నేర పరిశోధనా దృష్టితో పరిశీలించేటట్లు చేసింది. ఎంతో దయాగుణంతో ఉండే తను చంద్రం వంటి విశేష బాలుడి పట్ల ఎంత నిర్దయుగా ప్రవర్తించాడు?

చేతులు జోడించి ఆ తల్లీ కొడుకులకు జగన్నాథం దణ్ణం పెట్టాడు.

వా ళ్ళిద్దరూ జగన్నాథం దగ్గర నుంచి నిష్క్రమించారు.

చంద్రం పోలీసు లందరకూ తల్లిని పరిచయం చేశాడు. వా ళ్ళిద్దరూ ఆనందంగా వెళ్ళిపోయారు.

జగన్నాథం రమణయ్యను పిలిచాడు. చంద్రానికి భోజనం ఏమి పెట్టారని అడిగాడు.

రమణయ్య ఏమీ పెట్టలేదని చెప్పాడు.

"కారణం?" ప్రశ్నించాడు.

"రాత్రి కాఫీలు తెమ్మని హొటల్‌కు పంపించాం సార్. అక్కడ ఏదో తిని ఉంటాడు. భోజనం గురించి అడగలేదు." రమణయ్య చెప్పాడు.

"కాఫీలకు ఎంత డబ్బిచ్చారు?" జగన్నాథం ఆత్రుతగా ప్రశ్నించాడు.

ఎప్పుడూ ఇటువంటి ప్రశ్నలు అడగని జగన్నాథం ప్రశ్నలకు జవాబిచ్చే ధైర్యం లేక మౌనంగా ఉండిపోయాడు రమణయ్య.

"డబ్బులు ఇవ్వలేదా?" జగన్నాథం రెట్టించి అడిగాడు.

ఇవ్వలేదని తలూపాడు.

జగన్నాథంలో స్పందన మొదలైంది. హొటల్ యజమానిని పిలిపించాడు. చంద్రం గురించి అడిగాడు.

"డబ్బులు ఇచ్చి కాఫీలు తీసుకు వెళ్ళినట్లు చెప్పాడు. కాని చంద్రం ఏమీ తీసుకోలేదట'."

జగన్నాథం చలించిపోయాడు. చంద్రం! ఎంత ఉదార స్వభావం నీది. నిన్ను తప్పుగా అంచనా వేయడం నేను చేసిన గొప్ప తప్పిదం. ఇంత పసితనంలోనే అంత నిండుతనాన్ని సంతరించుకున్న నువ్వు జీవితంలో గొప్పస్థాయికి ఎదిగిపోతావు. అంత చిన్న వయసులో ఎటువంటి కష్టాన్నైనా దిగమింగి నిర్భయంగా సంచరించగలగడం నీకే చెల్లింది. నీ ఆకలి చంపుకుని ఇతరుల అవసరాలను నీ కున్న డబ్బుతో తీరచడానికి వెనుకాడని నీ లాంటి ఉత్తముడి కోసం ఈ జాతి ఎదురుచూస్తోంది. నీవు నాయకుడివై ఈ జాతిని ముందుకు నడిపించాలని కోరుకుంటున్నాను.

జగన్నాథం ఉద్యోగ నిర్వహణలో ఎన్ని గొప్ప అనుభవాలు ఎదురైనా చంద్రంతో అనుభవం మరువలేనిదని అతను లో తందని చంద్రుడని చెపుతూ ఉంటాడు.

'ఎందరో మహానుభావులు అందరకూ నా వందనాలు' అంటే ఏమిటో చంద్రాన్ని చూసిన తరువాత అర్థమైం దంటాడు జగన్నాథం. ★

## ఖర్చు

మంత్రి: ఏమిటి, రోడ్డంతా గతుకులుగా ఉంది ! మీ రంతా ఏం చేస్తున్నారయ్యా?

ఇంజనీరు: సారీ సార్ ! ఇక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉందని స్పీడ్ బ్రేకర్స్ వేద్దా మనుకున్నాము. అంతలో రోడ్డంతా గతుకులు ఏర్పడ్డాయి. స్పీడ్ బ్రేకర్స్ ఖర్చు తప్పిందిలే అని అలాగే ఉంచాము సార్ !

-కొరిమేల మల్లికార్జునరావు [నంద్యాల]

